మూడు రోజులు సైకిలు తొక్కితే వస్తుందనుకున్న అతని బహుమానం ఏమిటి?

# జొన్నల నాగభూషణరావు కథ

# గరీబీ హటావో

సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లోకి జనం విపరీతంగా వస్తూ పోతున్నారు.


సుమారు నలభై సంవత్సరాల పైడి అప్పలరాజు డెబ్బది రెండు గంటలు నిర్విరామంగా సైకిలు తొక్కడానికి అక్కడ పోటీ ఏర్పాటుచేయబడిందని మైక్‌లో నుండి జోరుగా వినబడుతోంది.

క్రితం రోజు సాయంకాలం అయిదు గంటలకు పుర ప్రముఖుల సమక్షంలో లాంఛనంగా ప్రారంభింపబడిన ఆ ప్రదర్శనలో మాట్లాడుతు ప్రముఖ బట్టల వర్తకుడు సేట్ బంకట్‌లాల్ "సోదర సోదరీ మణులారా! ఇప్పుడు మనముందు సైకిలుపై అనేక రకాల విన్యాసాలను ప్రదర్శింపబోయే ఈ పైడి అప్పలరాజుదివిశాఖపట్టణం. కడు బీదవాడు. ఈ రకమైన ప్రదర్శనలిస్తూ పొట్ట పోషించుకుంటూ మన భాగ్యనగరానికి రావడం జరిగింది."

"నా సహాయం అర్థిస్తే కాదవలేక నా చేతుల మీదుగా ఈ ప్రదర్శన ఏర్పాటుచేసి, ప్రతిరోజూ ఉదయం ఒక గంట కాలకృత్యాలు తీర్చుకోవడానికి మినహా మిగిలిన సమయం అంతా సైకిలు తొక్కుతూనే మూడు రోజులపాటు నిరాటంకంగా సాగితే, నా తరఫున అయిదువేల రూపాయలు బహుమానంగా ప్రకటిస్తున్నాను."

'సేట్ బంకట్‌లాల్ గారికి జై' అంటూ ఆ ప్రదేశమంతా నినాదాలతోనూ చప్పట్లతోనూ మారుమోగింది.

మల్లెపూలాంటి సిల్క్ లాల్చి నలగకుండా




అందించిన కూల్ డ్రింక్ తాగి, రిమ్ లెస్ కళ్ళద్దాలలోనించి తొంగిచూస్తూ తిరిగి ఉపన్యాసం కొనసాగించాడు.

''మహాశయులారా! మీలో కూడా ఎంతో మంది ఉదార స్వభావులు ఇతనికి సహాయం చేయాలని వుండవచ్చు. అందుకే మీ అందరికీ మరొక అవకాశం కల్పిస్తున్నాను.''

''ఈ మూడు రోజులు ఎవరైతే మా

షాపులో పాంటింగ్స్, షర్టింగ్స్ లేదా శారీస్‌గానీ కొంటారో వారందరికీ ఆ సేల్స్‌పైన టెన్ పర్సంట్ రిబేటు ఇవ్వడమే కాకుండా ఆ వచ్చే మొత్తం లాభాలలో యాభైశాతం కూడా ఈ అప్పలరాజుకే ఇచ్చివేస్తానని ఇందుమూలంగా మీకందరికీ సవినయంగా మనవి చేసుకుంటున్నాను. ఈ సదవకాశం కేవలం మూడురోజులే కావున మీకు కావలసిన డ్రెస్సింగ్స్ కై త్వరపడండి! ఒక పేద వాడిని ఆదుకోండి.''

'ధర్మప్రభువు బంట్‌లాల్ జిందాబాద్' అంటూ మరోమారు నినాదాలు వినిపించాయి.

ఆ ప్రదేశానికి చుట్టూ వాసాలతో ఫెన్సింగ్‌కట్టి లైట్లు అమర్చి ''శ్రీ బంకట్ లాల్ క్లాత్ ఎంపోరియమ్ వారి సౌజన్యంతో పైడి అప్పలరాజుచే మూడురోజులు సైకిలుపై విన్యాసాలు'' అంటూ అనేక చోట్ల బ్యానర్సు కట్టారు.

ఈ కార్యక్రమాలు పర్యవేక్షించడానికిగాను ముగ్గురు జడ్జీలు నియమించబడ్డారు.

రాత్రి పదిగంటలకు జనం కాస్త పల్చబడ్డారు.

పాత జడ్జీలస్థానే కొత్తవాళ్ళువచ్చారు.

బాగా మందుకొట్టి వచ్చారేమో రాత్రి ఒంటిగంటవరకూ పేకాడుతూ తెగవాగుతూనే వున్నారు.

తరువాత ఒకరి తరువాత ఒకరు నిద్రలోకి జారుకున్నారు.

సైకిలుచక్రాలు మెల్లిగా తిరుగుతున్నాయి. వాటితోపాటు అప్పలరాజు ఆలోచనలు కూడా అస్తవ్యస్థంగా తిరుగుతున్నాయి.

అంతవరకూ అనుకున్న ప్రకారం ప్రోగ్రాం బాగానే సాగుతోంది.

బంకట్‌లాల్ ఉపన్యాసంలో చెప్పినంత ఉదారంగా ఏమీ వొప్పుకోలేదు.

వారం రోజులపాటు అతని చుట్టూ తిరిగితే కసురుకొని చివరకు పది రూపాయలు చేతిలో పెట్టాడు.

ఎలాగైనా ఊళ్ళో కాస్తబాగా పలుకుబడివున్న వాళ్ళ అండదండలతో అయితే అలాంటి ప్రోగ్రాంస్‌కి బాగా డబ్బులువస్తాయని అప్పలరాజు పట్టువదలని విక్రమార్కుడిలా మళ్ళీ మళ్ళీ వెంట తగిలేసరికి ఇక లాభం లేదనుకుని అతని మునీమ్ భైరవానంద్ సలహా మేరకు ఈ ప్రోగ్రాం ఏర్పాటుకు సమ్మతించాడు.

అప్పలరాజు గంపెడు మంది పిల్లలతో పూట గడవని సంసారంలోపుట్టి ఎన్నో రకాల కష్టాలను జీవితపు తొలిరోజులలోనే చవి చూశాడు. స్కూలుఫైనలు వరకూ చదువుకున్నా సరీగా పరిక్షల ముందు తండ్రి చనిపోవడంతో ఇక చదువుకు స్వస్థిచెప్పి కుటుంబభారాన్ని పైనవేసుకున్నాడు.

ఎలాగైనా ఈ మూడు రోజులూ కష్టపడి సైకిలుతొక్కి పందెంలో గెలిస్తే ఆ వచ్చే డబ్బుతో క్షయతో చావు బ్రతుకుల మధ్య ఊగుతున్న భార్యకు కాస్తమంచి వైద్యం చేయించుకోవచ్చు.

తన వంశాంకురమైన ఒక్క కొడుకుని మంచిగా చదివించి ప్రయోజకుడిని చెయ్యావచ్చు.

రాత్రి రెండు గంటలయింది.

అటుగా వెడుతున్న ఫియట్ కారుని రోడ్ సైడ్‌గా పార్క్ చేసి ఎవరో వ్యక్తి దిగి అతని వద్దకు వచ్చి "ఎవడ్రానువ్! అర్ధరాత్రి పూట సైకిలు నేర్చుకుంటున్నావా? అంటూ అడిగాడు.

బాగా తాగి వున్నాడేమో తూలుతూ అక్కడి వాసం పట్టుకొని నిలతొక్కుకున్నాడు.

"లేద్సార్! నేను సైకిలుపై ఫీట్లు చేస్తాను" అంటూ పందెం తాలూకు వివరాలన్నీ చెప్పి హేండిల్ బార్ వదిలేసి సైకిలు గుండ్రంగా తొక్కుతున్నాడు.

అపరచిత వ్యక్తికి ముచ్చటేసి జేబులోంచి పర్సుతీసి పది రూపాయల కాగితం నేలపై వేసి "సైకిలు దిగకుండా దీనిని తీసుకోచూద్దాం" అన్నాడు.


సైకిలు ఒక రౌండ్ కొట్టివచ్చి ఆ నోటుకి దగ్గరగా ఆపి కాళ్ళు నేలపై పెట్టకుండా మెల్లగా బ్యాలన్స్ చేసుకుంటూ సైకిల్ని నేలపై పడుకోపెట్టి ముందు చక్రంపై చేతులు వెనక చక్రంపై కాళ్ళనూ వుంచి పూర్తిగా కిందికి వంగి కుడి కంటి రెప్పల మధ్య ఆ నోటుని నొక్కిపట్టి అలాగే తీసుకొని కొద్ది కొద్దిగా సైకిలు పైకి లేపుతూ ఒక్కసారి ఎగిరి సీటు మీదకూర్చుని రౌండు కొట్టి వచ్చాడు.

అంతసేపు నోటుని అలా కంటితోనే పట్టుకున్నాడు.

ఆ వ్యక్తికి ఆశ్చర్యం సంతోషం కలిగాయి!

దగ్గరకు తూలుకుంటూ వెళ్ళి అప్పల్రాజుకి షేక్‌హేండ్ ఇచ్చి పర్సులోంచి వంద రూపాయల కాగితం తీసి అతని చొక్కా జేబులో పెట్టాడు.

అప్పల్రాజు కృతజ్ఞతతో నమస్కారం పెట్టి "ఎందుకుసార్? పది రూపాయలిచ్చారు కదా" అంటే "నేను పేకాటలో రెండు గంటల్లో కష్టపడకుండా



రెండువేలు గెలిచాను అదే నువ్విక్కడ ఇంతకష్టపడుతుంటే కనీసం నీ కష్టాన్ని గుర్తించవలసిన జడ్జీలు కూడా హాయిగా తొంగున్నారు. పర్లేదు వుంచుకో'' అంటూ అలాగే తూలుకుంటూ వెళ్ళి కారు స్టార్ట్ చేసి వెళ్ళిపోయాడు.

అతనెవరో తెలియదు. అయినా అతని మంచిమనసుకి అప్పలాజు హృదయం జోహార్లర్పించింది.

తెల్లవారింది.

సరిగ్గా ఆరు గంటలకు సైకిలుదిగి ఒక గంటలో కాలకృత్యాలు ముగించుకొని తిరిగి ఏడు గంటలకల్లా సైకిలు తొక్కడం ప్రారంభించాడు. అయినా జడ్జీలు ఇంకా లేవ లేదు!

దారినపోయే వాళ్ళు మాత్రం కాసేపుఆగి చూసిపోతున్నారు.

ఎనిమిదిన్నరకు కొత్త జడ్జీలు వచ్చి పాత వాళ్లను నిద్దురలేపి రిలీవ్ చేసి పంపించారు.

క్రమేపీ జనం పెరుగుతున్నారు.

బంకట్‌లాల్ గారి మనుషులు వచ్చి మైక్‌లో ఎడ్వర్ టైజ్‌మెంట్లు జోరుగా సాగిస్తున్నారు.

ఆరోజు ఆకాశవాణి వివిధ భారతి ద్వారాకూడా వాణిజ్య ప్రకటనలు ఇప్పించడం జరిగింది.

దానితో అప్పలాజు సైకిలుఫీట్లు చూడటం మాటెలావున్నా బంకట్‌లాల్ క్లాత్ ఎంపోరియం మాత్రం కిట కిటలాడిపోతోంది.

ప్రతి సేల్స్‌మన్ సేల్స్‌గర్ల్స్ చిరునవ్వు ముఖానికి పులుముకొని కస్టమర్స్‌కి అవ సరమైన వాటితోపాటు అనవసరమైన వాటిని కూడా మాటల గారడీతో అతి చాకచక్యంగా అంట గడుతున్నారు

వెయ్యి రూపాయలకు పైగా బిల్లు చేసిన వారికి బంకట్‌లాల్ స్వయంగా కూల్‌డ్రింక్స్ తెప్పించి ఒక అభాగ్యజీవికి వారు అందిస్తున్న సహాయ సహకారాలకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాడు.

* * *

సాయంకాలం ఆరు గంటలు కావొస్తోంది.

జనంవేసే ఈలలు కొట్టే చప్పట్లు తప్ప ఆహారం మితంగా తీసుకోవడంతో అప్పలాజు శరీరం తేలికగా తూలిపోతున్నట్లుంది.

ఈరకం పందాలు అతనికి కొత్తకాకపోయినా తన మీద అంతపెద్ద మొత్తం అందునా ఆంధ్రుల రాజధాని అయిన భాగ్యనగరంలో జరగడం తన భాగ్య చక్రం ఒక కొత్తమలుపుతిప్పడంగా భావించి ఎక్కడ లేనిఓపికా తెచ్చుకొని కొత్త కొత్త ఫీట్లుచేసి ప్రజలను వినోదింప చేయాలని తంటాలు పడుతున్నాడు.

ఈరకం ప్రదర్శనలు ఎప్పుడోగానీ అదైనా ఒక గంటో రెండు గంటలో చూసే అలవాటున్న ప్రజలకు ఇంత భారీఎత్తున పుర ప్రముఖుల పర్యవేక్షణలో మూడు రోజుల పాటు జరగడం పైగా రేడియో ద్వారా కూడా ఎనౌన్స్ చేయడంతో జనం తండోపతండాలుగా వస్తున్నారు.

భూమి గుండ్రంగా తిరుగుతుందన్నట్లు రాజు గుండ్రంగా సైకిలు తొక్కుతూనే వున్నాడు!

రెండు కుండల నిండా నీళ్ళుపోసి అక్కడ పెట్టించాడు. చూసే ప్రేక్షకులలోంచి పది సంవత్సరముల పిల్లవాడిని ముందుకు రమ్మని పిలిచాడు. అలా సైకిలుతొక్కుతూనే హేండిల్ బార్ మీదికి రెండు తొడలు ఆనించి ముందుకు వంగి ఆ పిల్లవాడిని బొడ్డు దగ్గరగా నిక్కర్ బెల్ట్‌ని నోటితో గట్టిగా పట్టుకొని మెల్లగా బ్యాలన్స్ చేసుకుంటూ పైకి లేపాడు.

అలాగే రౌండ్లు తొక్కుతూ నీటితో నిండిన కుండలను రెండు చేతులతో పుచ్చుకొని సైకిల్ తొక్కసాగాడు.

నోటితో పిల్లవాడిని కరుచుకొని రెండు చేతులతో నీటి కుండలు పట్టుకుని తొడలతో హేండిల్ బ్యాలన్స్‌చేస్తూ అలా తొక్కుతున్న అప్పలాజుని చూసి జనం వెర్రిగా ఈలలు వేసి చప్పట్లు కొట్టసాగారు.

తరువాత మెల్లిగా కుండలనీ పిల్లవాడిని దింపాడు.

ముఖానికిపట్టిన చెమటను తుడుచుకున్నాడు.

ఆనందించి చిల్లర డబ్బులు నోట్లువేసే వాళ్ళకు నిండు మనసుతో కృతజ్ఞతలు చెప్పకున్నాడు.

కానీ బంకట్‌లాల్ సేల్స్ మాత్రం ఎంతగా పెరిగాయోచూస్తున్న ఆ షాపులో పని చేసే వారికే కళ్ళు కుదుతున్నాయి!

* * *

మూడో రోజు ప్రవేశించింది!

అప్పలాజుని నీరసం ఆవరించింది!!

ఎలాగైనా సరే సాయంత్రం ఆరుగంటల వరకూ పట్టుసడలకుండా తొక్కితే విజయలక్ష్మి వరిస్తుంది. ఈ దెబ్బతో తన దరిద్రం కొంత వరకూ తీరిపోవచ్చన్న ఆశతో ప్రాణాలుగ్గబట్టుకొని లేని ఓపిక తెచ్చుకొని తొక్కుతున్నాడు.

జనం ఎంత వెర్రివాళ్ళు!

ఏదో ఒక కొత్తదనం అందిస్తే చాలు తమంత తామే బోల్తా కొట్టేస్తారు.

అప్పలాజు మొర బంకట్‌లాల్ వినకపోయినా అతని మునీమ్ భైరవానంద్ సలహా మేరకు చివరకు ఈ పథకానికి వొప్పకోవడం వలన ఎంత మేలుజరిగిందోనని ఇప్పుడు తెగ సంబర పడిపోతున్నాడు.

పేరుకి పేరూ వచ్చింది!

పేరుకుపోయిన ఓల్డ్ స్టాకంతా

## సలహా



అయిదుగురు పిల్లల్తో రష్‌గా ఉన్న బస్ ఎక్కింది మీనాక్షి.

"అంత మందితో రాకపోతే సగం మందిని ఇంట్లో వదిలి రావచ్చుగా!" ఓ ఉచిత సలహా పడేశాడు కండక్టర్.

"అదే చేసివచ్చాను నాయనా" నీరసంగా బదులిచ్చింది మీనాక్షి

జోకర్ (హైదరాబాద్)

అప్పలాజు పుణ్యమా అని మాయమైపోయింది.

అందుకే అన్నారు 'తెలివి ఒకడబ్బ సొమ్మా' అని.

సాయంకాలం ఐదు గంటలయింది. పెద్ద పెద్దవాళ్ళంతా వస్తున్నారు.

అక్కడ వేసిన షామియానా అంతా నిండిపోయింది.

స్థానిక యమ్మెల్యే పానకాలరావు చేతుల మీదుగా అప్పలాజుకి బహుమానం ఇవ్వ డానికి ఏర్పాట్లు జరిగాయి.

అంతలో పానకాలరావు మారుతీ డీలక్స్‌లో వచ్చి తనకు కేటాయించిన సీటులో హుందాగా కూర్చున్నాడు.

సభ ప్రారంభమైంది.

పానకాలరావు మాట్లాడుతూ "కూలి వాళ్ళ చమటలోంచి పెద్దవాళ్ళ కడుపు మంటల లోంచి విప్లవాగ్నులు ప్రజ్వరిల్లి సమాజాన్ని చుట్టుముట్టకముందే ప్రజలు కళ్ళు తెరవాలని సాటివాళ్ళను ఆదుకోలేక పోతే మన బ్రతుకుల కర్థంలేదని— ఈ సందర్భంగా సేట్ బంకట్‌లాల్ కనబరచిన దాతృత్వం ఎంతగానో కొనియాడదగినది. రాబోయే కార్పోరేషన్ ఎన్నికలలో మా పార్టీ తరఫున ఇక్కడినుంచే వీరికి కౌన్సిలర్ సీటు ఇప్పించే బాధ్యత తనది. ఆ రకంగా బంకట్‌లాల్ ఇంకా ఎన్నో మంచి పనులు వేయగలరన్న ఆశాభావం నాకు వుంది." అంటూ విరమించాడు.

'బంకట్‌లాల్‌కు జై' అన్న నినాదాలతో గ్రౌండ్ అంతా మారు మ్రోగింది.

తరువాత మరో ఇద్దరు పెద్దల ప్రసంగాల నంతరం అప్పుడే కౌన్సిలర్ అయిపోయినంత ఆనందంగా ముఖం పెట్టి బంకట్‌లాల్ మైక్ ముందుకు వచ్చి "పెద్దలందరకూ నమస్కారములు! నేను చేసిన ఈ చిన్న పనికి మీరంతా నన్ను ఎంతగానో పొగిడారు. నాకు చిన్నప్పటినుంచి కూడా ఇలాటి మంచిపనులు చేయాలంటే ఎంతో ఇష్టం. మీ అందరికీ తెలుసూ మనందరికీ ఎంతో స్ఫూర్తినిచ్చిన నినాదం 'గరీబీ హటావో' ఎవరికి వారు తమకి చేతనయినంత పక్కవారికి సహాయం చేస్తేనే ఈ పేదరికం పోయి అందరూ హాయిగా వుంటారని నా నమ్మకం. ఈ సైకిల్ కింగ్ అప్పలాజు విషయంలో అతనికి సహాయం చేయాలన్న సదుద్దేశ్యంతో మా షాపులో డ్రెస్ కొన్నవారందరికీ మా ధన్యవాదాలు".

"ఇకపోతే అప్పలాజుకి నేను బహుమతిగా ఇస్తానన్నది ఐదువేలు. ఈ మూడు రోజుల సేల్స్‌లో వచ్చిన లాభాలలో సగం పంద్దొమ్మిది వేల రెండువందల రూపాయలు. ఆ పై ఎనిమిది వందలు కూడా అతనికే బోనస్‌గా ఇస్తున్నాను. అంతాకలిపి ఇరవై అయిదువేల రూపాయలను అప్పలాజును వచ్చి పానకాలరావుగారి చేతుల మీదుగా తీసుకోవ లసినదిగా కోరుతున్నాను" అనేసరికి అందరూ ఎంతో ఆనందంగా చప్పట్లు కొట్టసాగారు.

జనం మధ్యనుంచి మాసిన గడ్డంతో మురికి గుడ్డలతో నీరసంగా వచ్చి స్టేజి పైకి

ఎక్కి అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియచేసుకున్నాడు.

తను కలలో కూడా ఊహించని డబ్బు పానకాలరావు చేతులు మీదుగా తీసుకుంటు న్నప్పుడు కళ్ళు అశ్రుపూరితాలయి చేతులు వ ణికాయి.

ఆ రాత్రికే విశాఖపట్టణం వెళ్ళే సూపర్ డీలక్స్‌బస్‌లో సీటు రిజర్వు చేయించి కొత్త బ్రీఫ్‌కేస్‌లో ఇరవై ఐదువేల రూపాయలు అప్పల్రాజుకి రెండు జతల బట్టలు, అతని భార్యకు రెండు శారీస్ కూడా బహుమతిగా ఇచ్చి మంచి భోజనం పెట్టించి మునీమ్‌కు భైరవానంద్ చేత స్వయంగా కారులో పంపించి బస్సు ఎక్కించాడు బంకట్‌లాల్.

* * *

మూడు రోజులు బాగా అలిసిపోయి వాళ్ళు పులిసిపోయి వుండడంతోనూ, ఎప్పుడు వెళ్ళి భార్యని పిల్లవాడిని చూస్తానా అన్న ఆలోచనతోనూ బస్సు హైదరాబాద్ పొలిమేర దాటుతుండగానే బాగా నిద్రపట్టింది అప్పల్రాజుకి.

ఉదయం బస్సుదిగి కొత్త బ్రీఫ్‌కేస్ ఒకచేతితోనూ, తన పాత బట్టలు పైన దొరికిన డబ్బులు దాచుకున్న పాత సంచీ ఒక చేతితోనూ పట్టుకొని వూపుకుంటూ ఎంతో సంతోషంగా ఇంటికి చేరి ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతూ జరిగిన సంగతంతా పెళ్ళాం పిల్లవాడికి పూసగుచ్చినట్లు చెప్పి బ్రీఫ్‌కేస్ తెరిచి చూసే సరికి అందరూ ఒక్కసారి నోళ్ళు తెరిచారు.!

దాంట్లో పాత న్యూస్ పేపర్లు వున్నాయి!

అప్పల్రాజు కళ్ళు బైర్లుకమ్మాయి!

తన చేతులతోనే బ్రీఫ్‌కేస్‌లో డబ్బు బట్టలు పెట్టుకున్నాడు.

ఏమిటీ మాయ!

అసలేం జరిగింది? ఎలా జరిగింది?

తను మూడు రోజుల పాటు నిద్రహారాలు మాని పడిన రెక్కల కష్టమంతా ముక్కచెక్కలైంది.

రాత్రి బంకట్‌లాల్ ఇంట్లో అతను భోజనం చేస్తున్న సమయంలో అతి తెలివిగా డబ్బులు, బట్టలున్న బ్రీఫ్ కేస్ స్థానంలో సరీగా అలాంటి న్యూస్ పేపర్లతోనింపి తారుమారు చేసిన సంగతి పెద్ద మనుషులైన సేట్ బంకట్‌లాల్‌కు అతని మునీమ్ భైరవానంద్‌కూ తప్ప మూడో కంటికి తెలియదు!

ఎంతో పవిత్ర ఆశయంతో రూపొందించబడిన 'గరీబీ హటావో' నినాదం పైకి తియ్యని కబుర్లు చెబుతూ లోన గోతులు తవ్వే మేకవన్నె పులులైన బంకట్‌లాల్ లాంటి వాళ్ళ ద్వారా ఎలా 'గరీబీ హటావో'గా మారిపోతుందో చెప్పడానికి అప్పల్రాజుకి సెండాఫ్ ఇచ్చిన తరువాత వాళ్ళిద్దరూ సెలెబ్రేట్ చేసుకున్న స్కాచ్‌బాటిల్ సాక్షీభూతంగా మిగిలిందే తప్ప నోరులేదు!